ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -96 పేజీలు - 04 వెల - 04/- మంగళవారం 21 ఏప్రిల్ 2026

# పేదల ఆకలి తీర్చే లక్ష్యంతో అన్న క్యాంటీన్లు

**విజయవాడ పటమటలో అన్నక్యాంటీన్ ప్రారంభం -ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రారంభించామన్న చంద్రబాబు**




**విజయవాడ,ఏప్రిల్ 20, ఆంధ్ర ప్రగతి :**
ప్రతి ఒక్కరి కడుపు నిండాలని.. ఎవరూ ఆకలిలో ఉండకూడదనేదే అన్న క్యాంటీన్ల ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అన్న ఎన్టీఆర్.. తిరుమలలో ప్రారంభించిన అన్నప్రసాదం కార్యక్రమం స్ఫూర్తితో ఈ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామన్నారు. సోమవారం విజయవాడ పటమటలో అన్న క్యాంటీన్‌ను సీఎం చంద్రబాబు దంపతులు ప్రారంభించారు. అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. పేద వారికి కేవలం దానం చేసినట్లుగా కాకుండా, వారు గౌరవ ప్రదమైన వాతావరణంలో.. శుభ్రమైన, నాణ్యమైన పౌష్టికాహారాన్ని పొందేలా చూడటమే ఈ కార్యక్రమం ప్రత్యేకత అని చెప్పారు. ?ఇక్కడ ప్రత్యేకమైన క్యాంపస్, కాంపౌండ్ వాల్, పరిశుభ్రమైన వాతావరణం ఉంటుందని పేర్కొన్నారు. కేవలం రూ.5లకే ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడు పూటలా భోజనం అందిస్తున్నారని వివరించారు. ఆటో డ్రైవర్లు, ముఠా కార్మికులు, రోడ్లు ఊడ్చేవారు, ఇతర సామాన్య ప్రజలకు ఇది ఎంతో ప్రయోజనకరంగా **మిగతా 2లో...**



# అవకాశాలను అందిపుచ్చుకునేలా

**ప్రతి రంగంలో దక్షిణ కొరియాతో భాగస్వామ్యం: ప్రధాని మోదీ**

**మూడు రోజుల భారత పర్యటనకు వచ్చిన దక్షిణ కొరియా అధ్యక్షుడు**

**ఇరుదేశాల సంబంధాలు బలోపేతం అయ్యే దిశగా పలు ఒప్పందాలు**

**న్యూఢిల్లీ : ఏప్రిల్ 20, ఆంధ్ర ప్రగతి :**
ప్రతి రంగంలోనూ అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా దక్షిణ కొరియాతో భాగస్వామ్యం చేసుకుంటున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ మూడు రోజుల పర్యటనలో భాగంగా భారతదేశానికి వచ్చారు. ఇరుదేశాల సంబంధాలు బలోపేతం అయ్యే దిశగా ప్రధాని మోదీ, లీ జే మ్యూంగ్ సమక్షంలో పలు అవగాహన ఒప్పందాలు జరిగాయి.
ఈ సందర్భంగా జరిగిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, చిప్స్ నుంచి షిప్స్ వరకు, టాలెంట్ నుంచి సాంకేతిక వరకు, **మిగతా 2లో...**



# జెఇఇ మెయిన్‌లో మనోళ్లదే హవా..



**జేఈఈ మెయిన్ 2026 సెషన్-2 ఫలితాలు విడుదల**

**దేశవ్యాప్తంగా 26 మందికి 100 పర్సంటైల్**

**వంద పర్సంటైల్ సాధించిన వారిలో 10 మంది తెలుగు విద్యార్థులు**

**టాప్ 2.50 లక్షల మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత**

**మే 17న జరగనున్న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష**

**న్యూఢిల్లీ :ఏప్రిల్ 20, ఆంధ్ర ప్రగతి :**
దేశంలో లక్షలాది మంది విద్యార్థులు ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తున్న జెఇఇ మెయిన్ సెషన్-2 ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. మధ్యాహ్నం ఫైనల్ కీ విడుదల చేసిన ఎన్‌టిఎ అధికారులు.. తాజాగా పేపర్-1 (బిఇ/బిటెక్) పరీక్ష తుది ఫలితాలను ప్రకటించారు. అభ్యర్థులు తమ అప్లికేషన్ నెంబర్, పాస్‌వర్డ్, క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి స్కోర్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.జెఇఇ మెయిన్ తుది విడత **మిగతా 2లో...**

# చర్చలపై అనిశ్చితి !

**మూసుకుపోతున్న దారులు ! ఇస్లామాబాద్‌కు అమెరికా ప్రతినిధి బృందం**

**ఇంకా నిర్ణయించలేదన్న ఇరాన్ -అమెరికా ఆధీనంలో ఇరాన్ కార్గో నౌక**

**టెహ్రాన్ ఆగ్రహం, ప్రతీకార దాడులు తప్పవని హెచ్చరిక**

**టెహ్రాన్, వాషింగ్టన్ ఏప్రిల్ 20, ఆంధ్ర ప్రగతి ::** పాకిస్తాన్ మధ్యవర్తిత్వంతో అమెరికా, ఇరాన్ మధ్య జరగాల్సిన రెండో దశ చర్చలపై సోమవారం అనిశ్చితి నెలకొంది. అమెరికా కాల్పుల విరమణను ఉల్లంఘిస్తోందని పేర్కొన్న ఇరాన్, శాంతి చర్చలకు తమ ప్రతినిధి బృందాన్ని పంపే విషయమై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని ప్రకటించింది. **మిగతా 2లో...**





# వైభవంగా 'అప్పన్న' చందనోత్సవం

**వేపగుంట (విశాఖపట్నం) :**
విశాఖలోని శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో సోమవారం సింహాద్రి అప్పన్న చందనోత్సవం వైభవంగా సాగింది. ఏడాదికి ఒక్కసారి మాత్రమే లభించే అప్పన్న స్వామి నిజరూప దర్శనం కోసం యాత్రికులు భారీగా తరలివచ్చారు. సోమవారం తెల్లవారుజామున 2.40 గంటలకు**మిగతా 2లో...**

# తమిళనాడు ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు

**పుట్టినరోజున కృష్ణగిరి జిల్లా తళ్లిలో భారీ బహిరంగ సభ**

**డబుల్ ఇంజిన్ సర్కారుతోనే అభివృద్ధి సాధ్యమని స్పష్టీకరణ**

**ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపు**

**అధికార డీఎంకే ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు**



# ఉద్యోగం నుంచి డిస్మిస్

**ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డికి షాక్..**

**ఉద్యోగం నుంచి తొలగించిన ప్రభుత్వం**

**గత ఎన్నికల సమయంలో వైసీపీ తరపున ప్రచారం చేసిన వెంకట్రామిరెడ్డి**

**సర్వీస్ నిబంధనలను బేఖాతరు చేశారంటూ చర్యలు తీసుకున్న ప్రభుత్వం**

**రిటైర్మెంట్ బెనిఫిట్లు, పెన్షన్ ప్రయోజనాలను కూడా కోల్పోనున్న వెంకట్రామిరెడ్డి**



# ఎట్లొస్తారో చూస్తాం..

**ప్రతిపక్ష హోదా లేకుండా చేస్తాం**

**వచ్చే ఎన్నికల్లో చూస్కుందాం**

**ఔర్ ఏక్‌బార్ కాంగ్రెస్ సర్కార్**

**ఎవరడ్డొచ్చినా తొక్కుకుంటూ పోతాం**

**భారీ మెజార్టీతో విజయం సాధిస్తాం**

**ప్రజాపాలన ఎందుకు పోవాలో జీవన్‌రెడ్డే చెప్పాలి**

**: రైతు ఉత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి**

**-హైదరాబాద్ఏప్రిల్ 20, ఆంధ్ర ప్రగతి :**
'వచ్చే ఎన్నికల్లో నువ్వో.. నేనోడ తేల్చుకుందాం రా.. కేసీఆర్‌డ' అంటూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. 'ప్రజాపాలన పోవాలి.. కేసీఆర్ రావాలిడ అంటూ ఓ పెద్ద మనిషి అంటున్నారుడమా పాలన ఎందుకు పోవాలి? పాపాల భైరవుడి లాంటి కేసీఆర్ ఎందుకు రావాలో ఆయనే చెప్పాలిడ' అని మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని ఉద్దేశించి సీఎం ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ ప్రతిపక్షహోదా కూడా ఊడగొట్టకపోతే తన పేరు మార్చుకుంటానంటూ ఆయన శపథం చేశారు. ఔర్ ఏక్‌బార్ కాంగ్రెస్ సర్కార్ అంటూ నినదించారు. **మిగతా 2లో...**



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# వైభవంగా 'అప్పన్న' చందనోత్సవం

**మొదటిపేజీ తరువాయి**

చందన యాత్ర ప్రారంభమైంది. ఆలయ అనువంశిక ధర్మకర్త, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు లాంఛనప్రాయంగా తొలిదర్శనం చేసుకున్న అనంతరం యాత్రికులకు దర్శనం కల్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంకాలం ఆరు గంటల సమయానికి లక్ష మందికిపైగా యాత్రికులు స్వామివారిని దర్శించుకున్నారు. రూ. 1,500, రూ. 1,000, రూ. 300 ప్రత్యేక దర్శనాలతోపాటు ధర్మ దర్శనం లైన్లలో కూడా యాత్రికులు క్రమశిక్షణతో ముందుకు సాగారు. గతేడాది జరిగిన అపశ్రుతులను దృష్ట్యా అధికార యంత్రాంగం ఈసారి పటిష్ట ఏర్పాట్లు చేసింది. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా దేవస్థానంలోని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేశాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో మజ్జిగ, తాగునీరు, పాలు, బిస్కెట్లు, గ్లూకోజ్ వంటి పదార్థాలను పంపిణీ చేశారు. పోలీసు శాఖ గట్టి బందోబస్తు ఏర్పాటు చేసింది. స్వచ్ఛంద సేవా సంస్థలు యాత్రికులకు సేవలందించాయి.

# జెఇఇ మెయిన్‌లో మనోళ్లదే హవా..

**మొదటిపేజీ తరువాయి**

ఫలితాల్లో తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. ఈ పరీక్షల్లో దేశవ్యాప్తంగా 26 మందికి 100 పర్సంటైల్ స్కోరు రాగా.. వీరిలో ఏకంగా 10 మంది తెలుగు విద్యార్థులే ఉండటం విశేషం. 100 పర్సంటైల్ స్కోరుతో అదరగొట్టిన వారిలో జొన్నల రోషన్ మణిదీప్ రెడ్డి (ఏపి), మంథా శివ కామేశ్ (తెలంగాణ), నరేంద్ర బాబు గారి మహిత్ (ఏపి), తుంగా దుర్గా సుప్రభాత్ (ఏపి), డి భవితేశ్ రెడ్డి (తెలంగాణ), పసల మోహిత్ (ఏపి), సాయి రిత్విక్ రెడ్డి (తెలంగాణ), వివాన్ శరద్ మహిశ్వరి (తెలంగాణ), బి వెంకట చంద్రశేఖర్ రెడ్డి (ఏపి), రిషి ప్రేమ్‌నాథ్ (తెలంగాణ) ఉన్నారు.

జెఇఇ (మెయిన్) సెషన్ 1, సెషన్ 2 పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ఉత్తమ స్కోరును పరిగణనలోకి తీసుకొని జాతీయ ర్యాంకులను కేటాయించారు. ఈ పరీక్షల్లో రాణించి టాప్‌లో నిలిచిన మొత్తం 2.50 లక్షల మందికి జెఇఇ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అవకాశం కల్పిస్తారు. మే 17న జరిగే ఈ పరీక్షకు ఏప్రిల్ 23 నుంచి మే 4 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ కొనసాగనుంది. 'అడ్వాన్స్‌డ్'లోనూ సత్తాచాటిన విద్యార్థులకు జోసా కౌన్సెలింగ్ ద్వారా ప్రతిష్టాత్మక ఐఐటిల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తుంటారు.

**జెఇఇ మెయిన్ ఫైనల్ కీపై అభ్యంతరాలు.. ఎన్‌టిఎ వివరణ**

జెఇఇ మెయిన్ ఫైనల్ కీపై సామాజిక మాధ్యమాల్లో కొన్ని అభ్యంతరాలు వ్యక్తం కావడంపై ఎన్‌టిఎ స్పందించింది. తుది కీలను సమీక్షించినట్లు తెలిపింది. ఏప్రిల్ 8వ తేదీ సెషన్-2 కెమిస్ట్రీ పేపర్‌లో ప్రశ్నకు (క్యూ. 691121589)కు సరైన ఆన్సర్ 3 అని తెలిపింది. ఏప్రిల్ 2న సెషన్-2లో జరిగిన ఫిజిక్స్ పేపర్‌లో ప్రశ్న (క్యూ. 691121200)కు సరైన సమాధానం ఆర్ 60 అని తేల్చి చెప్పింది. నిపుణుల సమీక్ష అనంతరం వచ్చిన ఈ ప్రత్యామ్నాయ క్లెయిమ్‌లు తప్పుడు వ్యాఖ్యానాల ఆధారంగా ఉన్నట్లుగా పేర్కొన్న ఎన్‌టిఎ.. ఫైనల్ కీలో ఎలాంటి మార్పులూ లేవని స్పష్టం చేసింది.

# అవకాశాలను అందిపుచ్చుకునేలా

**మొదటిపేజీ తరువాయి**



ఎంటర్‌టైన్మెంట్ నుంచి ఎనర్జీ వరకు ప్రతి రంగంలో అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపారు. వాణిజ్య ఒప్పందాల విలువ 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు చేర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లీ జే యోంగ్ భారత పర్యటనలో ఉన్న దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్, ప్రధాని నరేంద్ర మోదీలతో కలిసి సెల్ఫీ దిగారు. సోమవారం నోయిడాలోని శాంసంగ్ తయారీ కేంద్రంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర విందు సందర్భంగా ఈ ఆసక్తికర దృశ్యం చోటుచేసుకుంది. ఇరు దేశాల నేతల మధ్య జరిగిన ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశం అనంతరం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా, భారత్‌లో శాంసంగ్ స్థానిక తయారీ సామర్థ్యాలను చాటిచెప్పారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ భారత్, వియత్నాం దేశాల పర్యటనలో భాగంగా భారీ వ్యాపార ప్రతినిధి బృందంతో కలిసి వచ్చారు. ఈ పర్యటనలో భాగంగా జరిగిన కొరియా-ఇండియా బిజినెస్ ఫోరంలో హ్యుందాయ్, ఎస్‌కే గ్రూప్, ఎల్జీ సంస్థల అధినేతలతో సహా సుమారు 250 మంది కొరియా వ్యాపారవేత్తలు పాల్గొన్నారు. 1996 నుంచి శాంసంగ్ తన నోయిడా ప్లాంట్‌లో బడ్జెట్ మోడల్స్ నుంచి ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్‌ల వరకు తయారుచేస్తోంది.

తన మూడు రోజుల పర్యటనలో భాగంగా, దక్షిణ కొరియా అధ్యక్షుడు ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌ను సందర్శించి జాతిపిత మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. "మహాత్మా గాంధీ శాంతి స్ఫూర్తి ప్రపంచాన్ని శాంతితో నింపాలని ఆశిస్తూ, నేను కూడా అందుకు సంయుక్తంగా కృషి చేస్తాను" అని లీ పేర్కొన్నారు. శాంతి, ప్రజాస్వామ్యం పునాదులపై ఇరు దేశాలు ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని 'ఎక్స్' వేదికగా ఆకాంక్షించారు.

# ఉద్యోగం నుంచి డిస్మిస్

**ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డికి షాక్..**

**ఉద్యోగం నుంచి తొలగించిన ప్రభుత్వం**

**ఏప్రిల్ 20, ఆంధ్ర ప్రగతి :**


ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు కె. వెంకట్రామిరెడ్డిపై కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో సర్వీస్ నిబంధనలను బేఖాతరు చేస్తూ వైసీపీ అభ్యర్థుల తరపున బహిరంగంగా ప్రచారం నిర్వహించారనే ఆరోపణలతో ఆయన్ను ఉద్యోగం నుండి తొలగిస్తూ (డిస్మిస్) సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనడం తీవ్రమైన క్రమశిక్షణారాహిత్యం కిందకు వస్తుందని, దీనిపై జరిగిన విచారణ అనంతరం ప్రభుత్వం ఈ కఠిన చర్యలు చేపట్టింది. ఈ నిర్ణయంతో ఆయన కేవలం ఉద్యోగాన్ని మాత్రమే కాకుండా, తనకు లభించాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్లు, పెన్షన్ ప్రయోజనాలను కూడా పూర్తిగా కోల్పోతారని తెలుస్తోంది.

# పేదల ఆకలి తీర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.

**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా అన్న క్యాంటీన్‌లో భోజనం చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 20:**





ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76 వ జన్మదినం సందర్భంగా నంద్యాల పట్టణంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏ.వి. సుబ్బారెడ్డి తో కలిసి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. మంత్రి ఫరూక్ మరియు ఏ.వి. సుబ్బారెడ్డి స్వయంగా క్యూ లైన్‌లో నిలబడి టోకెన్ తీసుకున్నారు. అనంతరం సామాన్య ప్రజలు, కూలీలు మరియు రోగుల సహాయకులతో కలిసి భోజనం చేశారు. క్యాంటీన్‌లో వడ్డించే ఆహార పదార్థాల రుచి మరియు నాణ్యతను మంత్రి ఫరూక్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనాన్ని కేవలం 5 రూపాయలకే అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ పేదవాడి ఆకలి తీర్చాలనే గొప్ప సంకల్పంతో చంద్రబాబు నాయుడు గారు అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించారని . ఆయన నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాం అని తెలిపారు. ముఖ్యమంత్రి జన్మదినం పురస్కరించుకుని ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా అన్ని అన్న క్యాంటీన్లలో పేదలకు ఉచితంగా భోజనం పంపిణీ చేస్తున్నట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పేదల ఆకలి తీరే లక్ష్యంతో అన్న క్యాంటీన్లు

**మొదటిపేజీ తరువాయి**



ఉంటుందని ఆయన ఆశాబావం వ్యక్తం చేశారు. ఇస్కాన్ ఫౌండేషన్ వారు సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా చాలా రుచికరమైన, నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 269 అన్న క్యాంటీన్లు పని చేస్తున్నాయని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ఇటీవల 62 కొత్త క్యాంటీన్లను ప్రారంభించామన్నారు. త్వరలోనే మరో 5 క్యాంటీన్లు ప్రారంభించి.. వాటి సంఖ్యను 274 కు చేర్చనున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లలో రూ. 76 లక్షల వ్యయంతో మూడు పూటలా ఉచిత భోజనం అందించేందుకు ముందుకు వచ్చిన తన సతీమణి నారా భువనేశ్వరిని ఈ సందర్భంగా చంద్రబాబు అభినందనలతో ముంచెత్తారు. ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా.. ఒక పూట భోజనం లేదా ఒక రోజు క్యాంటీన్ ఖర్చును భరించడం ద్వారా ఈ అన్నదాన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ప్రజలను కోరుతున్నామన్నారు. ఇది కేవలం ప్రభుత్వం చేసే పని మాత్రమే కాకుండా, ప్రజలందరూ ఒక స్ఫూర్తితో కలిసి రావాల్సిన వేదిక ఇది అని పేర్కొన్నారు. ప్రజలను ఆదుకునే కార్యక్రమాలు నిరంతరాయంగా జరగాల్సి ఉందన్నారు. ఇది కేవలం ఒక పూట ఆహారం అందించడంతో ముగిసిపోయేది కాకూడదని.. ?ప్రజల అభివృద్ధి కోసం దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు వెళ్లాల్సి ఉందని చెప్పారు. వారిని మనతో సమానంగా అన్ని రంగాల్లో పైకి తీసుకురావాల్సి ఉందని చెప్పారు. సమాజంలో ఉన్న ఆర్థిక అసమానత లను తగ్గించే దిశగా ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అదే నిజమైన ప్రజాస్వామ్యం, సమాజానికి స్ఫూర్తి కూడా అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అంటేనే 'అన్నపూర్ణ' అని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఎవరూ కూడా ఆకలితో అలమటించ కూడదన్నారు. గత ప్రభుత్వం పేదలకు అన్నం పెట్టే 'అన్న క్యాంటీన్లను' మూసివేసిందని విమర్శించారు. భోజనం పెట్టే వారిపై తప్పుడు కేసులు పెట్టి అరెస్ట్ చేయడం వారి ప్రవర్తనకు నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పేదలను ఆదుకోవడానికి అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలంటూ ప్రజలకు ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

# చర్చలపై అనిశ్చితి !

అమెరికా నౌకాదళం తమ దేశానికి చెందిన ఒక కార్గో నౌకపై కాల్పులు జరిపి దానిని స్వాధీనం చేసుకోవడంపై ఇరాన్ ఆగ్రహించింది. ప్రతీకార దాడులు చేస్తామని హెచ్చరించింది. నౌకలోని సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు సురక్షితంగా ఉన్నారని రూఢ చేసుకున్న తర్వాత దాడులకు దిగుతామని తెలిపింది. ఇదిలా ఉండగా అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, సీనియర్ అధికారులతో కూడిన బృందం చర్చల నిమిత్తం ఇస్లామాబాద్‌కు బయలుదేరింది. తాజా పరిణామాలు పశ్చిమాసియాలో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

**అమెరికా దురాక్రమణపై స్పందిస్తాం : ఐఆర్‌జిసి**

గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో తమ నౌకను అమెరికా స్వాధీనం చేసుకోవడంపై ఇరాన్ భగ్గుమంది. అమెరికా దళాలపై 'అవసరమైన చర్యలు' తీసుకుంటామని హెచ్చరించింది. అమెరికా దళాల దురాక్రమణపై నిర్ణయాత్మకంగా స్పందించేందుకు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) సిద్ధంగా ఉన్నదని తస్నిమ్ వార్తా సంస్థ తెలియజేసింది. నౌకలో సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా వున్నందున ఇరాన్ ఆచితూచి అడుగులు వేస్తోంది. ఇలాంటి పరిస్థితులలో రెండో విడత చర్చలకు అవకాశమే లేదని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘై స్పష్టం చేశారు. ఇరాన్ జాతీయ ప్రయోజనాలను కాపాడుకునే విషయంలో గడువులు, అల్టిమేటంలు విధించడంపై తమకు నమ్మకం లేదని ఆయన చెప్పారు.

**దిగ్బంధనం కొనసాగినంత కాలం చర్చల్లేవు**

తమ ఓడరేవుల దిగ్బంధనం కొనసాగినంత కాలం పాకిస్తాన్‌కు ప్రతినిధి బృందాన్ని పంపేదే లేదని ఇరాన్ తేల్చి చెప్పింది. 'హర్మ్యూజ్‌ను తెరిస్తే, ఇరాన్ ఓడరేవులను దిగ్బంధించడం కొనసాగితే మేము తప్ప అన్ని దేశాలు వ్యాపారం చేసుకుంటాయి' అని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘలీబఫ్ వ్యాఖ్యానించారు. ట్రంప్ ప్రకటనపై మండిపడిన ఇరాన్ చర్చల బృందం సభ్యుడు, రాజకీయ విశ్లేషకుడు మహమ్మద్ మరాండీ ఘాటుగా హెచ్చరికలు జారీ చేశారు. 'ఇరాన్ ప్రతీకారం తీర్చుకుంటుంది. యూఎఇ, బహ్రెయిన్, సౌదీ అరేబియా, ఖతార్, కువైట్‌లను వెంటనే విడిచిపొండి. ఇరాన్ ప్రతీకార చర్యలకు దిగి అన్నింటినీ ధ్వంసం చేస్తుంది' అని హెచ్చరించారు..

ఇదిలావుండగా, చర్చలపై సందిగ్ధత కొనసాగుతున్నప్పటికీ పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలు జరిగే వేదిక వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

**ఇరాన్ నౌకపై పలు రౌండ్ల కాల్పులు**

గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో ఇరాన్ ఓడరేవుల నుండి నౌకల రాకపోకలను దిగ్బంధించిన నేపథ్యంలో తమ ఆదేశాలను ఇరాన్ నౌక ఉల్లంఘించిందని, అందుకే తమ దళాలు దానిపై కాల్పులు జరిపి ఇంజిన్ గదికి నష్టం కలిగించాయని, ఆ తర్వాత తమ నావికులు నౌకను స్వాధీనం చేసుకున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పుకొచ్చారు. హర్మూజ్ జలసంధి సమీపంలో ఈ ఘటన జరిగింది. కాగా ఇరాన్ పతాకంతో గల్ఫ్ ఆఫ్ ఒమన్‌ను దాటేందుకు ప్రయత్నించిన నౌకకు చెందిన ఇంజిన్ గదిపై అనేక రౌండ్లు కాల్పులు జరిపామని అమెరికా సైన్యం తెలిపింది.

**హర్మూజ్‌పై పట్టును వదులుకోం : ఇరాన్**

హర్మూజ్ జలసంధిపై నియంత్రణను వదులుకునే ప్రశ్నే లేదని ఇరాన్ తేల్చి చెప్పింది. అది తమ నుండి విడదీయరాని హక్కు అని ఐఆర్‌జిసి మాజీ కమాండర్ ఇబ్రహీం అజిజి చెప్పారు. హర్మూజ్‌లో నౌకల రాకపోకలపై ఇరాన్ నిర్ణయం తీసుకుంటుందని, అనుమతులు కూడా ఇస్తుందని తెలిపారు. తాజా పరిణామాల నేపథ్యంలో శత్రువును ఎదుర్కోవడానికి హోర్మూజ్ ఒక ఆయుధంగా, ఆస్తిగా మారిందని తెలిపారు.

**భగ్గుమన్న చమురు ధరలు**

హోర్మూజ్ జలసంధిని ఇరాన్ తిరిగి మూసివేయడంతో అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు భగ్గుమన్నాయి. అంతర్జాతీయ బెంచ్‌మార్క్ అయిన బ్రెంట్ క్రూడ్ ఏడు శాతం పెరిగి 96.88 డాలర్లకు చేరింది. ఇరాన్ కార్గో నౌకను అమెరికా స్వాధీనం చేసుకున్న తర్వాత శాంతి ఒప్పందానికి తలుపులు దాదాపుగా మూసుకుపోయిన నేపథ్యంలో సోమవారం చమురు ధరలు మరింతగా పెచ్చరిల్లాయి. శుక్రవారం నుంచి చమురు ధరలు పెరుగుతూనే ఉండడం గమనార్హం. హర్మూజ్‌ను తెరుస్తున్నామంటూ ఇరాన్ చేసిన ప్రకటనతో దిగివచ్చిన చమురు ధరలు ఇప్పుడు మళ్లీ పెరుగుతున్నాయి. ఇప్పటివరకు పశ్చిమాసియాలో జరిగిన దాడుల్లో 3,375మంది మరణించారని ఇరాన్ సోమవారం ప్రకటించింది.

# తమిళనాడు ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు

**ఏప్రిల్ 20, ఆంధ్ర ప్రగతి :**






ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తమిళనాడు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సోమవారం తన 76వ పుట్టినరోజున ఆయన కోయంబత్తూరు, కృష్ణగిరి జిల్లా తళ్లి నియోజకవర్గంలో ఎన్డీయే కూటమి తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికార డీఎంకే ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన చంద్రబాబు, డబుల్ ఇంజిన్ సర్కారుతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. తళ్లిలో నిర్వహించిన బహిరంగ సభకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. జనం భారీగా తరలిరావడంతో చంద్రబాబు ఉత్సాహంగా ప్రసంగించారు. చంద్రబాబు పుట్టినరోజు కావడంతో కొందరు అభిమానులు, కార్యకర్తలు 'హ్యాపీ బర్త్ డే సీబీఎన్ సర్' అనే ప్లకార్డులు ప్రదర్శించి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. తమిళనాడులో మార్పు రావాలంటే ఎన్డీయే కూటమి అధికారంలోకి రావాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే కూటమి ప్రభుత్వం ఉంటే అభివృద్ధి వేగవంతం అవుతుందని తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి డబుల్ ఇంజిన్ సర్కారు వల్లే సాధ్యమైందని ఆయన ఉదాహరించారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చంద్రబాబు రెండు రోజుల పర్యటన చేపట్టారు. ఏప్రిల్ 23న పోలింగ్ జరగనుండగా, 21వ తేదీతో ప్రచారం ముగియనుంది. తన పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం మధురై, సాతూర్ ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటారు.

# ఎట్లొస్తారో చూస్తాం..

**మొదటిపేజీ తరువాయి**

ఎవరడ్డొచ్చినా తొక్కుకుంటూ పోతాం భారీ మెజార్టీతో మువ్వన్నెల జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూరిపల్లిలో నిర్వహించిన 'ప్రజాపాలన-రైతు ఉత్సవాల' బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. సభావేదిక నుంచి రెండోవిడత రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్‌పైనా, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌పైనా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆనాడు డీఎస్, వైఎస్ జోడెద్దుల్లా పని చేసి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. అదే మాదిరిగా పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌తోపాటు కార్యకర్తల సహకారంతో తాను రెండోసారి పార్టీని అధికారంలోకి తీసుకొస్తానని వ్యాఖ్యానించారు. తద్వారా చరిత్రను తిరగరాస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్‌ఎస్ ఓటమి తప్పదని, అది జగిత్యాలతోనే ప్రారంభమవుతుందని హెచ్చరించారు. ఉప ఎన్నికలు, సర్పంచ్ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటిందని గుర్తు చేశారు. చివరికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సైతం కేసీఆర్‌కు ఘోరీ కట్టామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆ ఘోరీ మీద కాంగ్రెస్ జెండాను ఎగరేస్తామని హెచ్చరించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
మంగళవారం 21 ఏప్రిల్ 2026

# బసవేశ్వరుల ఆలోచనలు ఆచరణలో పెట్టాలి.

**..సౌభ్రాతృత్వం, సమానత్వం కోసం బసవేశ్వరుల బోధనలు. -కలెక్టరేట్‌లో బసవేశ్వరుల 893వ జయంతి వేడుకలు.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 20:**
బసవేశ్వరుల ఆలోచనలను ఆచరణలో అమలు చేసి సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం వంటి విలువలను కాపాడాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన మహాత్మా బసవేశ్వరుల 893వ జయంతి వేడుకల సందర్భంగా, ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాల అర్పించి పుష్పాంజలి ఘటించారు.




ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మహాత్మా బసవేశ్వరుల 893వ జయంతి వేడుకులు జరుపుకుంటున్నామన్నారు. బసవన్నగా ప్రసిద్ధి చెందిన బసవేశ్వరులు 12వ శతాబ్దానికి చెందిన మహనీయ సామాజిక సంస్కర్త, తాత్వికుడు, సమానత్వ వాదిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచారన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో జన్మించిన బసవేశ్వరులు కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడుతూ, స్త్రీ పురుష సమానత్వాన్ని ప్రోత్సహించారని కలెక్టర్ తెలిపారు. సమాజంలో సమాన హక్కులు, న్యాయం, ధర్మం స్థాపన కోసం ఆయన చేసిన కృషి అపారమైందన్నారు. తన సాహిత్య కవిత్వం ద్వారా సాధారణ ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా ఉన్నతమైన ఆలోచనలను వ్యాప్తి చేశారని ఆమె తెలిపారు.
బసవేశ్వరులు స్థాపించిన లింగాయత సంప్రదాయం నేటికీ విశేషంగా అనుసరించబడుతోందన్నారు. కర్ణాటకలోని బీజాపూర్ ప్రాంతం నుంచి భక్తులు శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనార్థం పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారని కలెక్టర్ తెలిపారు. తెలుగు సాహిత్యంలో ప్రముఖ స్థానాన్ని సంపాదించిన పాల్కురికి సోమనాథుడు, బసవేశ్వరుల చరిత్రను "బసవ పురాణం" ద్వారా ప్రజల్లో విస్తృతంగా పరిచయం చేశారన్నారు. ద్విపద ఛందస్సులో రచనలు చేసిన ఈయన ప్రజాకవిగా పేరుపొందారన్నారు. అదేవిధంగా "మల్లికార్జున పండితారాధ్య చరిత్ర" వంటి గ్రంథాలను రచించి ఆధ్యాత్మిక, సాహిత్య రంగాలకు సేవలందించారని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాము నాయక్, జిల్లా టూరిజం అధికారి కె విజయలక్ష్మి జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కొత్తూరు సుబ్బరాయుడు ఆలయ అభివృద్ధికి 50 వేలు విరాళం..!

**..ఆలయ ప్రధాన అర్చకులు కంపమల్ల సురేష్ శర్మ**

**-ఆలయ ఈవో యం.రామక్రిష్ణ.**

**ఆంధ్ర ప్రగతి పాణ్యం/కొత్తూరు ఏప్రిల్ 20:**
ప్రముఖ శైవక్షేత్రం లక్షలాదిమంది భక్తుల ఆరాధ్య దైవమైన పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానము ఆలయము అభివృద్ధి నిమిత్తం భక్తులు రూ.50 వేల 116-/లు విరాళంగా సోమవారం సమర్పించినట్లు ఆలయ ఈవో యం.రామక్రిష్ణ తెలిపారు. బనగానపల్లె మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన టి.వెంకటరామయ్య కుమారుడు, కోడలు, మనవడు టి.నాగ శేఖర్ టి.జయలక్ష్మి, జయాన్స్ సూర్య వారికి శ్రీ స్వామివారు ఇంటి ఇలవేల్పు కావడంతో మొక్కుబడిగా 50,116-/లు విరాళంగా సమర్పించారు. వారికి ఆలయ మర్యాదలతో శ్రీ స్వామివారికి అభిషేకము, అర్చనలు, విశేష పూజలు నిర్వహించి, స్వామివారి శేష వస్త్రములు, పూలమాలలతో ఘనంగా సత్కరించి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కంపమల్ల సురేష్ శర్మ, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, గ్రామ సేవకుడు సుబ్బరామయ్య, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# సమాజానికి మార్గదర్శకుడు విశ్వగురు మహాత్మా బసవేశ్వర.

**..జిల్లా కలెక్టర్ డాక్టర్. ఏ. సిరి.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు, ఏప్రిల్, 20:** విశ్వ గురుమహాత్మా బసవేశ్వర తన జీవితాంతం సౌభ్రాతృత్వం, సమానత్వం అనే విలువలను ఆచరణలో పెట్టి సమాజానికి మార్గదర్శకుడిగా నిలిచారని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. సోమవారం కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సెట్కూర్ ఆధ్వర్యంలో మహాత్మా బసవేశ్వర 893వ జయంతిని పురస్కరించుకొని వీరశైవ సంఘాల నాయకులు, అధికారుల తో కలిసి జిల్లా కలెక్టర్ మహాత్మా బసవేశ్వర చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో కుల వ్యవస్థను వర్ణ భేదాలను లింగ వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయ వాది మహాత్మా బసవేశ్వర అని కొనియాడారు. కర్ణాటక రాష్ట్రం బాగేవాడి లో జన్మించిన మహాత్మా బసవేశ్వర బసవన్న వచ్చిన సాహిత్యంతో ప్రజలందరిని కులమతాలకతీతంగా ఏకం చేశారన్నారు. కాయమే (శరీరం) కైలాసమని, చాటి శ్రమజీవులకు అత్యంత గౌరవం తీసుకొచ్చారన్నారు. దేహమే దేవాలయం అని, శ్రమని మించిన సౌందర్యం లేదని బోధించారన్నారు. కుల వివక్షను ఖండిస్తూ ప్రతి మనిషి సమానమే అన్న భావనను ఆయన ప్రచారం చేసినట్లు గుర్తుచేశారు. సౌభ్రాతృత్వం అనే విలువను ప్రతి ఒక్కరూ ఆచరించాలని, పరస్పర గౌరవం, ప్రేమ, సహకారంతో కూడిన సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (ఇంచార్జి) చిరంజీవి, సెట్కూర్ సీఈవో వేణుగోపాల్, జిల్లా పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ అధికారి లక్ష్మీనారాయణ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గాండ్ల శ్రీధర్, జిల్లా క్రీడ ప్రాధికార సంస్థ అధికారి భూపతి రావు, రాష్ట్ర వీరశైవ ఐక్య వేదిక అధ్యక్షులు మల్లికార్జునప్ప, ఉపాధ్యక్షులు వీర శేఖరప్ప, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరప్ప, రాష్ట్ర జంగమ సంక్షేమ సమాజం అధ్యక్షులు మల్లికార్జునయ్య, వీరశైవ సాధికార సమితి కన్వీనర్ టి.డి.పి శివ రాజు, యాగంటీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# స్వీయ గణన 2027లో ప్రజల భాగస్వామ్యం పెంచాలి

**జిల్లాలో నీటి తొట్టెల నిర్వహణపై ప్రత్యేక దృష్టి.**
**యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి.**
**స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం.**
**వాట్సాప్ సేవలపై విస్తృత అవగాహన అవసరం.**
**..జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 20:**
కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వీయ గణన 2027 కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనంతరం స్వీయ గణన, స్వర్ణాంధ్రస్వచ్ఛ ఆంధ్ర, జలధారజలహారతి, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, వాట్సాప్ సేవలు, పీజీఆర్ఎస్ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ రాము నాయక్, నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్ మరియు జిల్లా అధికారులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్వీయ గణనలో ప్రజలు స్వయంగా ఆన్లైన్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకునే విధానం అమలులో ఉందని తెలిపారు. మొబైల్ నంబర్ ద్వారా లాగిన్ అయి, జియో కోఆర్డినేట్స్ ఆధారంగా గృహాన్ని గుర్తించి, అందులోని ప్రశ్నలకు సమగ్రంగా సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు. ఈ ప్రక్రియను గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు విస్తృతంగా అమలు చేయాలని, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**పరిశుభ్రత - నీటి తొట్టెల నిర్వహణపై ఆదేశాలు**



జిల్లాలో ఉన్న 467 నీటి తొట్టెలను ప్రతిరోజూ శుభ్రపరచి, ఉదయం, సాయంత్రం వేళల్లో నీటితో నింపాలని ఆదేశించారు. ప్రతి పంచాయతీలో కనీసం ఒక వాటర్ ట్రఫ్ ఉండేలా చూడాలని, నిర్వహణ అనంతరం ఫోటోలు తీసి సంబంధిత అధికారులకు పంపాలని సూచించారు. స్వర్ణాంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆసుపత్రులు పరిశుభ్రంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి కార్యాలయంలో మూడు రంగుల డస్ట్‌బిన్లు (బ్లూ, గ్రీన్, రెడ్) ఏర్పాటు చేయాలని, చలివేంద్రం కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**ఆకస్మిక తనిఖీలు కార్యాలయాల ప్రమాణాలు**
ఈ వారంలో పాఠశాలలు, వసతి గృహాలు, ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను స్పష్టంగా ప్రదర్శించేలా గోడపత్రాలు, బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

**యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే - వేగవంతం చేయాలి**
యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేలో పెండింగ్‌లో ఉన్న విద్యార్హతలు, నైపుణ్యాల వివరాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని వివరాలు సమగ్రంగా నమోదు అయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

**జలధార - జలహారతి కార్యక్రమాలు**
నీటి సంరక్షణ కార్యక్రమాలను వేగవంతం చేయాలని, ఎంపీడీవోలు, తహశీల్దార్లు, జలవనరుల శాఖ అధికారులు సమన్వయంతో ట్యాంక్ ప్లాన్, విలేజ్ ప్లాన్ సిద్ధం చేయాలని తెలిపారు. గ్రామాల్లో నీటి వనరుల ఆక్రమణలను అరికట్టాలని, కాలువల వద్ద చెత్త వేయకుండా జాలీలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

**కాలువల శుభ్రత కఠిన చర్యలు**
నంద్యాల పరిసరాల్లోని ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని ఆదేశించారు. నీటి వనరులను కలుషితం చేయడం నేరమని హెచ్చరిస్తూ, పంచాయతీరాజ్ చట్టం 1994, మున్సిపల్ చట్టం 1965 ప్రకారం జరిమానాలు లేదా జైలు శిక్షలు విధించబడతాయని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

**అభివృద్ధి పనులు గడువు నిర్ధేశం**
ఎంపీడీవోలు అభివృద్ధి పనులను గుర్తించి వెంటనే సిస్టమ్‌లో నమోదు చేయాలని, అనుమతులు తక్షణమే మంజూరు చేస్తామని తెలిపారు. ఇప్పటికే 596 పనులకు పరిపాలనా అనుమతులు ఇచ్చినట్లు వెల్లడించారు. అన్ని పనులు త్వరితగతిన భౌతికంగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పని చేసి నిర్ణీత గడువులో లక్ష్యాలను పూర్తి చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# రీ-ఓపెన్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి

**త్వరిత పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాలు. - ..పీజీఆర్ఎస్ వేదికగా ప్రజా సమస్యల స్వీకరణ - 230 అర్జీలు నమోదు.**

**..పెండింగ్ దరఖాస్తులపై వేగవంత చర్యలు తీసుకోవాలి. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 20:**
ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి రీ-ఓపెన్ అయిన దరఖాస్తులను ప్రత్యేక శ్రద్ధతో త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రాము నాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు ఉప ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించి రీ-ఓపెన్ చేసిన దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యలపై సరైన ఎండార్స్‌మెంట్ ఇవ్వకపోతే ప్రభుత్వం దానిని తీవ్రంగా పరిగణిస్తుందని హెచ్చరించారు. ప్రతి దరఖాస్తును బాధ్యతాయుతంగా పరిశీలించి, సమగ్రంగా నివేదికలు సమర్పించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో మొత్తం 5,283 దరఖాస్తులు రీ-ఓపెన్ చేయబడగా, వాటిలో 4,919 దరఖాస్తులు పరిష్కరించబడ్డాయని, ఇంకా 364 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల విషయంలో సంబంధిత అర్జీదారులతో సంప్రదించి తక్షణమే పరిష్కారం చూపాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి కార్యాలయం పరిధిలో 167 దరఖాస్తులు రీ-ఓపెన్ కాగా, వాటిలో 161 పరిష్కరించబడ్డాయన్నారు, ఇంకా 6 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, అలాగే ఉప ముఖ్యమంత్రి కార్యాలయం పరిధిలో 26 దరఖాస్తులు రీ-ఓపెన్ కాగా, వాటిలో 25 పరిష్కరించబడి, 1 దరఖాస్తు పెండింగ్‌లో ఉందని తెలిపారు.

**రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 162 దరఖాస్తుల స్వీకరణ**
భూ సంబంధిత సమస్యలను సమగ్రంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ క్లినిక్స్ ద్వారా భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా పరిష్కరించే అవకాశముందని పేర్కొన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా మొత్తం 162 దరఖాస్తులు స్వీకరించగా, వాటిలో రెవెన్యూ మరియు గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి 6, అడంగల్ సవరణలకు సంబంధించినవి 27, చుక్కల భూముల క్రమబద్ధీకరణ మరియు 22-ఎ భూములకు సంబంధించినవి 28, అసైన్డ్ భూములు మరియు భూ ఆక్రమణలకు సంబంధించినవి 25, రెవెన్యూ కోర్టు విచారణలు/ఆర్ఓఆర్‌కు సంబంధించినవి 22, సర్వే మరియు రీ-సర్వేలకు సంబంధించినవి 51, దేవాదాయ మరియు వక్ఫ్ భూములకు సంబంధించినవి 3 దరఖాస్తులు ఉన్నాయని వివరించారు.
1) చాగలమర్రి మండలం ముత్యాలపాడు గ్రామానికి చెందిన ఉలవపల్లె సంజీవ రాయుడు, సర్వే నెంబర్ 416లో ఉన్న 0.75 సెంట్ల తన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.
2) నంద్యాల మండలం సంజామల గ్రామానికి చెందిన గుంతమల్ల శ్రీదేవి, తనకు కాళ్లు-చేతులు సరిగా పనిచేయక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, వికలాంగుల పెన్షన్ మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.
3) నందికొట్కూరు మండలం బ్రాహ్మణ కొట్కూరు గ్రామానికి చెందిన మల్ల నూరుద్దీన్, సర్వే నెంబర్ 150లోని 2.56 ఎకరాల భూమి తన పేరుపై ఉన్నప్పటికీ, ఇప్పటివరకు ఒక్కసారైనా అన్నదాత సుఖీభవ పథకం కింద ఆర్థిక సహాయం అందలేదని జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.
4) నందికొట్కూరు మండలం కాకనూరు గ్రామానికి చెందిన పెరుమాళ్ల రాజు, సర్వే నెంబర్ 1150లోని 1.50 ఎకరాల భూమిని గత పది సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఆ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి పాసుబుక్కులు మంజూరు చేయించాలని జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.

# అగ్ని ప్రమాదాల నివారణకు అవగాహన అవసరం

**..జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, ఏప్రిల్ 20:** అగ్ని ప్రమాదాల నివారణకు అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఏప్రిల్ 14 నుండి 20 వరకు నిర్వహించిన కార్యక్రమాలలో భాగంగా చివరి రోజు సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియం కారిడార్‌లో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అగ్నిమాపక పరికరాల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 14 నుండి 20 వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా జిల్లాలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. "సేఫ్ స్కూల్, సేఫ్ హాస్పిటల్ & ఫైర్ సేఫ్టీ సొసైటీ టుగెదర్ ఫర్ ఫైర్ ప్రివెన్షన్" అనే ప్రధాన థీమ్‌తో ఈ కార్యక్రమాలు నిర్వహించి, అన్ని వర్గాల ప్రజల్లో అగ్ని భద్రతపై అవగాహన కల్పించామన్నారు. అగ్ని ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, అపార్ట్మెంట్ లలో, కార్యాలయాల్లో తప్పనిసరిగా అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రమాదం సంభవించిన వెంటనే అగ్నిమాపక శాఖ అత్యవసర సేవ నంబర్ 101 కు సమాచారం అందించడం ద్వారా వేగవంతమైన సహాయం పొందవచ్చని కలెక్టర్ సూచించారు. సమయస్ఫూర్తి, అప్రమత్తత తో ప్రాణ, ఆస్తి నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు.
జిల్లా అగ్నిమాపక అధికారి అవినాష్ జయ సింహ మాట్లాడుతూ... ఏప్రిల్ 14 నుండి 20 వరకు నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాల్లో ప్రజల్లో అగ్నిభద్రతపై అవగాహన కల్పిస్తూ, బాధ్యతాయుత ప్రవర్తన, ముందస్తు జాగ్రత్తల గురించి వివరించామన్నారు.. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలు, పరిశ్రమలు మరియు నివాస ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించామని తెలిపారు. అనంతరం అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అగ్నిప్రమాదాల నివారణ, తీసుకోవలసిన చర్యలు, జాగ్రత్తలకు సంబంధించిన పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (ఇంచార్జి) చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, ఏ.డి.ఎఫ్.వో చిన్న బజారి, లీడింగ్ ఫైర్ మ్యాన్ రంగస్వామి, వెంకటరాముడు, కార్యాలయ సిబ్బంది మల్లికార్జున, రామాంజనేయులు, నాగేశ్వరరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# ప్రజల ఫిర్యాదులను నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించండి.

**..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, ఏప్రిల్ 20:** ప్రజా ఫిర్యాదులను నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రజల నుండి సమస్యల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి దరఖాస్తును పరిశీలించి పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారులకు అందజేసే ఎండార్స్‌మెంట్లు స్పష్టంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. రీ-ఓపెన్ అయిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని పరిష్కరించాలన్నారు. ఎట్ టూ వ్యూ లో ఏ ఒక్క అర్జీ పెండింగ్ లో ఉండకూడదన్నారు. అధికారుల లాగిన్ లోకి వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలన్నారు. 1100 కాల్ సెంటర్ ద్వారా సిటిజన్ ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారని, ఫీడ్ బ్యాక్ ద్వారా సంతృప్తి వ్యక్తపరిచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..కార్యక్రమంలో ఇంచార్జి డిఆర్ఓ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కారుణ్య నియామకాల కింద రెవెన్యూ శాఖలో ఉద్యోగాలు

**..నియామక ఉత్తర్వులు అందజేసిన జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**

**..అభ్యర్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పిన కలెక్టర్.**




**ఆంధ్ర ప్రగతి కర్నూలు, ఏప్రిల్ 20:** కారుణ్య నియామకాల కింద రెవెన్యూ శాఖ లో 8 మందికి ఆఫీసు సబార్డినేట్, ఒక్కరికి జూనియర్ అసిస్టెంట్ లుగా ఉద్యోగాలు ఇస్తూ జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందచేశారు.సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు కలెక్టర్ నియామక ఉత్తర్వులను అందచేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ అభ్యర్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు.ఇది మంచి అవకాశం అని, ఉద్యోగాలు పొందిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ సూచించారు. ఉద్యోగాలు పొందిన వారంతా మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులుగా ఎదిగే అవకాశం ఉందని, ఇప్పటినుంచే అన్ని అంశాలను నేర్చుకుని, కెరీర్ ను డెవలప్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ, చొరవ చూపడం వల్ల తమకు ఉద్యోగ నియామకం జరిగిందని అభ్యర్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు.కార్యక్రమంలో లో ఇన్చార్జి డిఆర్ఓ చిరంజీవి, సంబంధిత సెక్షన్ సిబ్బంది, అభ్యర్థులు పాల్గొన్నారు.

## తాటికొండ బుగ్గ రాముడు ఆధ్వర్యంలోఘనంగా..

**సీఎం చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 20:**



నంద్యాల పట్టణంలోని 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ నందు రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ ఎండి.ఫరూక్, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నండి.ఫిరోజ్, రాష్ట్ర యువ నాయకుడు ఎన్ఎండి.ఫయాజ్ ఆదేశాల మేరకు వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బుగ్గరాముడు మాట్లాడుతూ.. ముందుగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన పుట్టిన రోజు సందర్భంగా వికాలాగులకు,వృద్దులకు పాలు,పండ్లు,బ్రెడ్లు వంటివి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు తాటికొండ మహేష్ బాబు, హిమామ్ హుస్సేన్,వడ్డేనాగేంద్ర,కుమ్మరి కోటీశ్వరుడు,కల్కి రాఘవేంద్ర,తలారి మల్లయ్య, డ్రైవర్ రమణ, తలారి జగన్ కుమారు,ఖాజ తదితర టీడీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రైతు గోస తీరబోతోంది..

**మంత్రి లోకేష్ హామీతో చిగురించిన ఆశలు.!**

**ఆంధ్ర ప్రగతి అమరావతి/నంద్యాల:** నేషనల్ హైవే 167 కేఅలైన్‌మెంట్ మార్పు వల్ల నష్టపోతున్న రైతుల సమస్య త్వరలోనే కొలిక్కి రానుంది. రైతునగరం రైతు నాయకుడు శంకర్ రావు గారు అమరావతిలో ఐటీ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ని కలిసి వినతిపత్రం సమర్పించారు.



**మంత్రి లోకేష్ సానుకూల స్పందన**

రైతుల ఇబ్బందులను ఓపికగా విన్న మంత్రి లోకేష్ వెంటనే స్పందించారు."రైతులకు అన్యాయం జరగనివ్వం. సామాన్య రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే అలైన్‌మెంట్‌పై సంబంధిత అధికారులతో చర్చిస్తాను," అని హామీ ఇచ్చారు. నిబంధనల ప్రకారం రైతులకు సానుకూల పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

**మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి మద్దతు:**ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి గారు ఈ అంశంపై రైతులకు అండగా ఉండి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని భరోసా ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మంత్రి హామీతో అలైన్‌మెంట్ మార్పుపై రైతుల్లో నమ్మకం పెరిగింది.

# నంద్యాలలో వైభవంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు.

**..76 కేజీల భారీ కేక్ కట్ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్. -..రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమాలతో సందడి.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 20:**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు 76 వ పుట్టినరోజు వేడుకలు నంద్యాల పట్టణంలో అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. స్థానిక మంత్రి క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సంబరాల్లో రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, టిడిపి మాజీ రాష్ట్ర కార్యదర్శులు రామచంద్రరావు, తులసి రెడ్డి, జిల్లెల్ల శ్రీరాములు, యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, డాక్టర్ బాబాన్ ముఖ్య అతిథిలుగా పాల్గొని, పార్టీ శ్రేణుల మధ్య 76 కేజీల భారీ కేక్ కట్ చేశారు. యువత, పార్టీ కార్యకర్తల ఉత్సాహం మధ్య రక్తదాన శిబిరాన్ని మంత్రి ఫరూక్ ప్రారంభించారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, బెడ్ ను పంపిణీ చేసి వారి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. పార్టీ కార్యాలయం వద్ద కార్యకర్తలకు, అభిమానులకు మధ్యాహ్నం భారీ విందు ఏర్పాటు చేయగా, పేదల కోసం ప్రత్యేకంగా నంద్యాల ప్రభుత్వ ఆస్పటల్ నందు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు నాయుడునిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ మసీదులు, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ అపర చాణక్యుడు, విజన్ ఉన్న నాయకుడు నారా చంద్రబాబు నాయుడు 76వ వసంతంలోకి అడుగుపెట్టడం మనందరికీ గర్వకారణం అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే ధ్యేయంగా ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలోనూ, రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడంలోనూ ఆయనకు ఆయనే సాటి అని కొనియాడారు. ముస్లిం మైనార్టీల అభివృద్ధికి చంద్రబాబు ఎల్లప్పుడూ పెద్దపీట వేశారని, ఆయన నాయకత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని పార్టీ కార్యకర్తలే చంద్రబాబు కి కొండంత అండ అన్నారు . ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని తెలిపారు. ఈ






కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు, వివిధ హోదాలలో ఉన్న నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జేవిసి ఈ -జోన్ ఎలక్ట్రిక్ వెహికల్ షోరూమ్ ను ప్రారంభించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 20:**
నంద్యాల పట్టణంలోని కరెంట్ ఆఫీస్ ఎదురుగా జేవిసి ప్రసాద్, మాజీ కౌన్సిలర్ హారిక నూతనంగా ఏర్పాటు చేసిన జేవిసి ఈ -జోన్ (గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ - ఆంపియర్) ఈవీ షోరూమ్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, నందికొట్కూరు టీడీపి ఇంచార్జ్ మరియు మాజీ నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షులు గౌరు వెంకట రెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసి రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి షోరూమ్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం నేటి కాలంలో ఎంతో అవసరమని అన్నారు. అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఆంపియర్ ఎలక్ట్రిక్ స్కూటర్లు సామాన్యులకు అందుబాటులో ఉండటం అభినందనీయమని, నంద్యాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ సందర్భంగాగౌరు వెంకట రెడ్డి మరియు తులసి రెడ్డి మాట్లాడుతూ కాలుష్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ ఈవీ వాహనాల వైపు మొగ్గు చూపాలని, పట్టణంలో ఇటువంటి షోరూమ్ ఏర్పాటు చేయడం వల్ల స్థానిక వాహనదారులకు నాణ్యమైన సేవలు అందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా టీడీపి ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, ఎన్ఎండి ఫయాజ్ షోరూమ్ నిర్వాహకులు, స్థానిక నాయకులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఐఎంఏ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంది

**: ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బాలరాజు.**

**విశిష్ట అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ శ్రీహరి.**

**నంద్యాలలో ఐఎంఏ రాష్ట్రస్థాయి వర్కింగ్ కమిటీ సమావేశం.**

**హాజరైన ఐఎంఏ రాష్ట్ర నాయకులు.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 19:**
ఆదివారం నంద్యాలలో స్థానిక హోటల్ ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ వర్కింగ్ కమిటీ సమావేశం, నంద్యాల ఐఎంఏ నిర్వహణలో ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ దగ్గుబాటి శ్రీహరి, రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ బాలరాజు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుభాష్ చంద్రబోస్, మాజీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు.

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎస్ బాలరాజు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర ఐఎంఏ వర్కింగ్ కమిటీ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఐఎంఏ నాయకులు పాల్గొన్నారు. ఐఎంఏ అసోసియేషన్ బలోపేతానికి తీసుకోవలసిన చర్యల పట్ల,వైద్యుల సమస్యల పరిష్కారానికి ఏ విధంగా కృషి చేయాలి, ఐఎంఏ సభ్యుల సంక్షేమానికి చేపట్టవలసిన కార్యక్రమాల గురించి సుదీర్ఘంగా చర్చించారు.

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బాలరాజు మాట్లాడుతూ ఐఎంఏలో ప్రైవేటు వైద్యులు, ప్రభుత్వ వైద్యులు సభ్యులుగా ఉన్నారని, రాష్ట్రంలోని 100 శాఖలలో 22 వేల మంది పైగా సభ్యులు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ రంగంలో, ప్రైవేటు రంగంలో వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐఎంఏ కృషి చేస్తుందని ప్రకటించారు. వైద్యం పొందుతున్న రోగులు వ్యాధి తీవ్రత వలన మరణించిన సమయాల్లో వైద్యులపై, ఆసుపత్రులపై భౌతిక దాడులు పెరుగుతున్నాయని, ఇది తీవ్ర ఆందోళన కలిగిస్తున్న విషయమని అన్నారు. వైద్యులపై దాడులు పెరిగితే అత్యవసర కేసులు చూడడానికి వైద్యులు వెనకంజ వేసే పరిస్థితి వస్తుందని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ వైద్యుల 2008 రక్షణ చట్టం సవరించి వైద్యులపై, ఆసుపత్రులపై దాడి చేసే వారికి కఠిన శిక్షలు విధించే విధంగా ప్రస్తుత చట్టాన్ని బలోపేతం చేయవలసిన అవసరం ఉందని అన్నారు. అగ్నిమాపక శాఖ నిరభ్యంతర పత్రం విషయంలో ఆసుపత్రిలో ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలన్నారు. వైద్యుల సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే ప్రభుత్వానికి వినతి పత్రం అందజేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ వైద్యులు వైద్య వృత్తిని నైతిక విలువలతో, నిబద్ధతతో కొనసాగించాలని కోరారు. సమావేశం అనంతరం రాష్ట్ర నాయకులను నంద్యాల ఐఎంఏ తరపున డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ పనిల్ కుమార్, నంద్యాల ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మహమ్మద్ రఫీ, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ




సౌజన్య, వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ వసుద ,డాక్టర్ హరిత ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ,డాక్టర్ త్యాగరాజ రెడ్డి, డాక్టర్ నాగళ్ళ కిషోర్, డాక్టర్ అశోక్, డాక్టర్ బాల మద్దయ్య, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ ప్రసాద్ రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శిలు డాక్టర్ ఫణి ధర్, డాక్టర్ రెహమాన్, నంద్యాల ఐఎంఏ నాయకులు డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, డాక్టర్ మధుసూదన రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్, రాష్ట్ర ఐఎంఏ ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ మధుసూదన శర్మ, సంయుక్త కార్యదర్శులు డాక్టర్ పనిల్ కుమార్, డాక్టర్ జంధ్యాల శివకుమార్, డాక్టర్ సునీల్, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# నంద్యాలలో బంగారు దుకాణాలపై బి. ఐ.ఎస్ అధికారుల మెరుపు దాడులు.!

... మహానంది బంగారు దుకాణంలో హాల్ మార్క్,హెచ్ యూ ఐడి లేని 3 కేజీల బంగారు ఆభరణాలు సీజ్.

...తనికిలతో బంగారు దుకాణాలు మూసివేసి పరార్.

...నంద్యాలలో ఎవరు హల్మర్క్ లేని బంగారు విక్రయించి ప్రజలకు మోసం. -...బంగారు వ్యాపారులు నకిలీ బంగారము విక్రయించి కోట్లు గడించారా.











**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ ఏప్రిల్ 20:** నంద్యాల పట్టణంలో బంగారు వ్యాపారుల మోసం ఒక్కసారిగా బట్టబయలు అయింది.పట్టణంలో పెద్ద,పెద్ద బంగారు వ్యాపారులు సైతం ప్రభుత్వ నిబంధనలు విరుద్ధంగా ఇన్నేళ్లు నకిలీ బంగారం విక్రయించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.బంగారు కొనుగోలు,అమ్మకాలు ప్రజలకు సరైన అవగాహన ఉండదు.బంగారు దుకాణం యజమానిపై నమ్మకంతో ప్రజలు బంగారు ఆభరణాలు కొనుగోలు చేస్తారు.బంగారు ఆభరణాలు కు వాడే బంగారు ఒరిజినల్ ఏదో,నకిలీ ఏదో ఎవరికి అర్థం కాదు.24 క్యారెట్లు,22 క్యారెట్లు,18 క్యారెట్ల బంగారు అని వివిధ రకాల ధరలు వ్యాపారులు చెప్పినంత కొనుగోలు చేస్తారు.బంగారు దుకాణాల్లో కొన్నప్పుడు తరుగు ,కూలి,అదే వస్తువు అక్కడే అమ్మితే మళ్ళీ తరుగు ,కూలి తీసుకుంటారు అడిగితే అంతే అనే సమాధానమే వస్తుంది.ఈ నేపథ్యంలోనే అక్షయ తృతీయ కు బంగారు కొనాలని వ్యాపారులు విపరీతమైన ప్రచారాలు చేస్తారు.అక్షయ తృతీయ రోజు బంగారు కనీసం ఒక గ్రాము కొన్నా మీ అదృష్టం వరిస్తుంది అని చెప్పడంతో ప్రతి ఏటా బంగారు ధరలు ఆకాశాన్ని అంటుతున్న మూఢ నమ్మకాలతో అప్పు చేసినా కొనుగోలు చేస్తారు.ప్రభుత్వం బంగారు వ్యాపారులపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో నంద్యాలలో మహానంది బంగారు దుకాణంలో బంగారు ఆభరణాలు హాల్ మార్క్,హెచ్,యూ, ఐడి మార్క్ లేకుండా విక్రయాలు సాగిస్తున్నారని విజయవాడలోని బి. ఐ.ఎస్ అధికారులకు పిర్యాదు అందింది.విజయవాడ నుంచి వచ్చిన బి. ఐ.ఎస్ అధికారులు నంద్యాల పట్టణం మెయిన్ బజారులోని మహానంది బంగారు దుకాణంలో తనికీలు నిర్వహించారు.అధికారుల తనికిల్లో చిన్న ,చిన్న బంగారు వస్తువులు ప్రభుత్వ నిబంధన లేకుండా విక్రయాలు సాగిస్తున్న 3 కేజీల బంగారు ఆభరణాలు అధికారులు సీజ్ చేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం 2021 నుంచి బంగారు ఆభరణాలు నాణ్యతవి విక్రయించాలని ప్రతి బంగారు ఆభరణాలు హాల్ మార్క్,హెచ్.యూ.ఐడి విక్రయించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు.నంద్యాలలో ప్రభుత్వ నిబంధనలు లేకుండా నకిలీ హాల్ మార్క్ తో విక్రయాలు సాగిస్తున్నారని సమాచారం మేరకు తనికీలు చేశామన్నారు.ప్రజలు బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకొని,కొనుగోలు చేసిన వస్తువులు తప్పనిసరిగా చెక్ చేయించుకోవాలన్నారు.వ్యాపారులపై నమ్మకంతో కొనుగోలు చేస్తే మోసపోవడం మీ వంతు అవుతుందన్నారు.తనికీలు చేస్తుండడంతో నంద్యాల పట్టణంలోని అన్ని బంగారు దుకాణాలు మూసివేసి పరారయ్యారు.నిజంగా నంద్యాలలో ఒరిజినల్ బంగారు విక్రయిస్తుంటే ఎందుకు దుకాణాలు మూసి వెళ్లారు అని ప్రజలు చర్చించుకోవడం విశేషం.ఇన్నాళ్లు బంగారు ఆభరణాలు కొనుగోలు చేసి మోసపోయామా అని చెప్పుకోవడం విశేషం.రాష్ట్ర వ్యాప్తంగా నంద్యాలలో జరిగిన బంగారు దుకాణంలో బంగారు విక్రయాలకు ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయని ప్రజలకు తెలిసిపోయింది.ఒక్క నంద్యాలలో ఒక్క దుకాణంలో నీ దాదాపు 4.50 కోట్ల బంగారం సీజ్ చేశారంటే మిగతా బంగారు దుకాణాల్లో ఎన్ని కోట్ల బంగారు దొరుకుతుందో ఊహించుకుంటే కళ్ళు బైర్లు కమ్మడం ఖాయం.వాస్తవానికి బంగారు దుకాణం యజమానులు బంగారు ఎక్కడ కొంటారు,వారు ఎవరినుంచి కొంటారు,బిల్లు తో కొంటున్నారా,జీరో లో కొనుగోలు చేసి విక్రయాలు సాగిస్తున్నారా అనే విషయాలు అధికారులు ఎప్పుడైనా తనికీలు చేశారా.బంగారు దుకాణాలు తనికీలు చేయడం లేదంటే అధికారులకు భారీగా ముట్టుతున్నాయని అని అనుకోవాల్సిందే.అధికారులు ఇప్పటికైనా బంగారు దుకాణాలకు బంగారు ఎక్కడ నుంచి కొనుగోలు చేస్తున్నారు,బిల్లు లు ఉన్నాయా,అసలు ఒరిజినల్ బంగారమా,నకిలీ బంగారమా అని దర్యాప్తు చేస్తే ప్రభుత్వానికి ఆదాయం తో పాటు ప్రజలు మోసపోకుండా నాణ్యమైన బంగారు లభిస్తుంది.నంద్యాలలో తనికీలు జరుగుతుండడంతో జిల్లా వ్యాప్తంగా బంగారు వ్యాపారస్తుల్లో కలకలం మొదలైంది.మరో వైపు అధికారులు నిరంతరం తనికీలు భారీగా చేస్తామని చెప్పడంతో వ్యాపారుల్లో వణుకు మొదలైంది.

# ప్రభుత్వ కళాశాలలో మాయమైన విద్యార్థిని విద్యార్థులఫోన్లు






**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 20:**నంద్యాల పట్టణంలోని ప్రముఖ కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ప్రభుత్వ పి.యస్.సి&కె.వి.యస్.సి కళాశాల నందు డిగ్రీ రెండవ సంవత్సరం పరీక్షలు రాసేందుకు పరీక్ష కేంద్రాం(ఎగ్జామ్స్ సెంటర్)లో విద్యార్థుల మొబైల్ ఫోన్లు అనుమతి లేనందున అందరూ ఒకే కళాశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు కావడంతో తమ15 మొబైల్ ఫోన్లు ఒక స్కూటీ డిక్కీలో పెట్టి మూడు గంటలు పరీక్షలు రాసి వచ్చి చూడగా 15 మొబైలు కనిపించకపోవడంతో మొదట పరిక్ష కేంద్రంలో ఫిర్యాదు చేయగా కళాశాల నిర్వాహకులు మాకు ఎలాంటి సంబంధం లేదంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో నంద్యాల మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ నందు విద్యార్థినీ విద్యార్థులు ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన సిఐ ఫిర్యాదును స్వీకరించి తప్పనిసరిగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.ప్రభుత్వ పియస్సి&కెవియస్సి కళాశాల (పరీక్షల కేంద్రంలో) సీసీ కెమెరాలు ఉండి కూడా మొబైల్ ఫోన్లు దొంగిలించడం ఆశ్చర్యానికి గురి చేసింది.విద్యార్థినీ విద్యార్థులు తమ ఫోన్లో దొంగలించిన వారిపై కఠిన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని విద్యార్థిని విద్యార్థులు మూడవ పట్టణ పోలీసులను కోరారు.

# చిన్నారి వైద్యానికి అండగా హెల్పింగ్ హ్యాండ్ సోసైటీ.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 20:** నంద్యాల జిల్లాకు చెందిన ఓ కాంట్రాక్టు హోంగార్డు కుమారుడి వైద్య ఖర్చుల నిమిత్తం 'హెల్పింగ్ హ్యాండ్ సోసైటీ' మానవత్వాన్ని చాటుకుంది. నంద్యాల అగ్నిమాపక కేంద్రం లో కాంట్రాక్ట్ హోంగార్డు గా పని చేస్తున్న నాగేంద్రుడు ని కుమారుడు ఉమేష్ గత కొంతకాలంగా గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. బాలుడికి పేస్ మేకర్ అమర్చాలని, అందుకు సుమారు 3 లక్షల రూపాయల వరకు ఖర్చవుతుందని వైద్యులు సూచించారు. నిరుపేద కుటుంబం కావడంతో అంత పెద్ద మొత్తాన్ని భరించే శక్తి లేక నాగేంద్రుడు ఆందోళన చెందుతుండగా, హెల్పింగ్ హ్యాండ్ సోసైటీ అధ్యక్షుడు సద్దల చంద్రశేఖర్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.ఈ క్రమంలోనే ఎస్డిఆర్ స్కూల్ మరియు ఎస్ డి ఆర్ ఆకాంక్ష జూనియర్ కాలేజ్ యాజమాన్యాల సహకారంతో నిధులు సేకరించి బాలుడి వైద్యానికి అవసరమైన ఆర్థిక సాయాన్ని అందజేశారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ చేతుల మీదుగా సోమవారం ఈ చెక్కును హోంగార్డు కుటుంబానికి అందజేయడం జరిగింది. ఆపత్కాలంలో తమ కుటుంబాన్ని ఆదుకున్న సద్దల చంద్రశేఖర్ రెడ్డికి, ఎస్ డి ఆర్ స్కూలు మరియు ఎస్డిఆర్ ఆకాంక్ష జూనియర్ కాలేజ్ ల చైర్మన్ శనివారపు కొండారెడ్డి కి బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

# మాజీ భర్త షేరు బాషా వేధింపులు.. రక్షణ కల్పించండి.

- ..బాధితురాలు సమీరా బేగం ఆవేదన.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 20:** తన ఆస్తిని కాజేయడమే కాకుండా, కన్న కొడుకు అని చూడకుండా రోడ్డుపైకి గెంటివేస్తూ ప్రాణహాని తలపెడుతున్న మాజీ భర్త షేరు బాషా నుంచి తనకు, తన పిల్లలకు రక్షణ కల్పించాలని బాధితురాలు సమీరా బేగం సోమవారం మహిళా సంఘాలతో కలిసి ఆందోళన చేపట్టారు. నంద్యాల వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. తనకు వివాహమై 20 ఏళ్లు పూర్తికాగా, గతంలోనే తన తల్లి బతికున్న సమయంలోనే మొదటి భర్తతో విడాకులయ్యాయి. ఆ తర్వాత తన తల్లి సమక్షంలోనే రెండో వివాహం చేసుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. గతంలోనే తన తల్లి నుంచి సంక్రమించిన ఆస్తికి సంబంధించిన పంపిణీ జరిగిందని, ఇంటి పత్రాలు, పన్ను రసీదులు అన్నీ తన పేరు మీదనే ఉన్నాయని ఆమె స్పష్టం చేశారు.అయితే గత కొన్నేళ్లుగా తన మాజీ భర్త షేరు బాషా ఆ ఆస్తిపై కన్నేసి, దౌర్జన్యంగా తన డాక్యుమెంట్లను లాక్కున్నాడని బాధితురాలు కన్నీరు మున్నీరయ్యారు. అయ్యలూరుకు చెందిన తన మాజీ భర్త షేరు బాషా అత్త కొడుకు అలీ సహకారంతో మాజీ భర్త నిరంతరం దాడులకు తెగబడుతున్నాడని, ఇటీవల ఆపరేషన్ చేయించుకున్న తన 18 సంవత్సరాల కుమారుడిని, 12 సంవత్సరాల కూతురిని కనికరం లేకుండా ఇంటి నుంచి బయటకు గెంటివేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివాదంపై ఇప్పటికే కోర్టును ఆశ్రయించి ఇంజక్షన్ ఆర్డర్ కూడా తెచ్చుకున్నప్పటికీ, వారి వేధింపులు ఆగడం లేదని పేర్కొన్నారు. పోలీసుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేకపోవడంతోనే తాను మహిళా సంఘాల అండతో రోడ్డుపైకి రావాల్సి వచ్చిందని ఆమె తెలిపారు. ఈ క్రమంలో తన ప్రాణాలకు, తన పిల్లల ప్రాణాలకు మాజీ భర్తతో పాటు అలీ వల్ల ముప్పు పొంచి ఉందని, తమకు ఏ క్షణంలోనైనా అపాయం కలగవచ్చని ఆమె భయాందోళన వ్యక్తం చేశారు. ఈ ఆందోళన నేపథ్యంలో ఘటనా స్థలానికి చేరుకున్న నంద్యాల వన్ టౌన్ పోలీసులు బాధితురాలిని, మరో వర్గాన్ని సముదాయించారు. ఇరు పక్షాల వాదనలు విన్న పోలీసులు, చట్టపరంగా పూర్తి విచారణ జరిపి బాధితురాలికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ప్రస్తుతానికి పరిస్థితి సద్దుమణిగింది. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తన ఇంటిపై తనకు హక్కు కల్పించి, ప్రాణ రక్షణ కల్పించాలని సమీరా బేగం వేడుకుంటున్నారు.

# సుదర్శన్ సర్జికల్ క్యాన్సర్ కేర్ క్లినిక్ ప్రారంభోత్సవం.

..క్లినిక్ ఏర్పాటు చేసిన ప్రముఖ క్యాన్సర్ సర్జన్ డాక్టర్ వై. నాగ సుదర్శన్ రెడ్డి, క్యాన్సర్ మెడికల్ స్పెషలిస్ట్ డాక్టర్ సుస్మిత.

..క్లినిక్ ప్రారంభించిన ఐఎంఏ జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ రవి కృష్ణ.

..క్యాన్సర్ ను ప్రాథమిక దశలో గుర్తించడం అవసరం: డాక్టర్ నాగ సుదర్శన రెడ్డి



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 20:**

నంద్యాల ఉదయానంద మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి క్యాన్సర్ విభాగంలో క్యాన్సర్ శస్త్ర చికిత్సా నిపుణులుగా పనిచేస్తున్న ప్రముఖ క్యాన్సర్ సర్జన్ డాక్టర్ వై నాగ సుదర్శన్ రెడ్డి, క్యాన్సర్ మెడికల్ స్పెషలిస్ట్ గా పని చేస్తున్న డాక్టర్ సుస్మిత లు , పట్టణ ప్రజలకు ఓపిడి సేవలు అందించాలని ఉద్దేశంతో పద్మావతి నగర్ మెయిన్ రోడ్డు లో మున్సిపల్ ఆఫీసు సమీపంలో, ఎమ్మెస్సార్ ఆసుపత్రి పక్కన సోమవారం "సుదర్శన్ సర్జికల్, క్యాన్సర్ కేర్ క్లినిక్ " ను ఐఎంఏ జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఉదయానంద క్యాన్సర్ ఆసుపత్రిలో క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు గా, లాప్రోస్కోపిక్ సర్జన్ గా పనిచేస్తున్న డాక్టర్ వై. నాగ సుదర్శన్ రెడ్డి, క్యాన్సర్ మెడికల్ స్పెషలిస్ట్ గా పని చేస్తున్న డాక్టర్ సుష్మిత నంద్యాల ప్రజలకు పట్టణంలోనే అందుబాటులో సేవలు అందించాలనే ఉద్దేశంతో క్లినిక్ ప్రారంభించడం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. క్లినిక్ లో ప్రాథమిక దశలో క్యాన్సర్ లక్షణాలు గమనించడానికి ఆస్కారం ఏర్పడుతుందని తద్వారా ఉదయానంద క్యాన్సర్ ఆసుపత్రిలో వారికి అవసరమైన క్యాన్సర్ చికిత్సలు అందించడానికి ఈ క్లినిక్ దోహదపడుతుందన్నారు. డాక్టర్ నాగ సుదర్శన రెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్ ను ప్రాథమిక దశలో గుర్తిస్తే,శస్త్ర చికిత్సల ద్వారా, రేడియేషన్ థెరపీ, మెడికల్ థెరపీ చికిత్సలు ఏది అవసరమైతే అది అందివ్వడం ద్వారా క్యాన్సర్ బారి నుండి తప్పించుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. క్యాన్సర్ చికిత్సలు రాష్ట్ర ప్రభుత్వ డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలో పేదలకు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉదయానందా ఆసుపత్రి డైరెక్టర్ లు పరమేశ్వర రెడ్డి, రామకృష్ణారెడ్డి,నంద్యాల వైద్యులు పాల్గొని డాక్టర్ నాగ సుదర్శన రెడ్డి డాక్టర్ సుష్మితులను అభినందించారు.

# శ్రీ గురు రాజ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుచే గోశాల ప్రారంభోత్సవం.









**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 20:**
గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పి.దస్తగిరి రెడ్డి ఆధ్వర్యంలో బాబా నగర్ నందు గల శ్రీ గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో ప్రవచన చక్రవర్తి, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గురు రాఘవేంద్ర గోశాలను ప్రారంభించారు. సోమవారం ఉదయం చాగంటి కోటేశ్వరరావు సతి సమేతంగా స్కూల్ ప్రాంగణానికి విచ్చేసి, పురోహితుల సమక్షంలో దస్తగిరి రెడ్డి కుటుంబ సభ్యులు గోశాలను శాస్త్రోక్తంగా పూజలు చేశారు. చాగంటి కోటేశ్వరరావు స్కూల్ ప్రాంగణంలోని సరస్వతి కళామతల్లి విగ్రహానికి పూలమాలవేసి, వందన సమర్పణ గావించారు. అనంతరం ఎలక్ట్రికల్ వాహనం నందు స్కూల్ క్యాంపస్ వీక్షించారు. నేటితరం చిన్నారులకు అన్ని వసతులతో కూడినటువంటి పాఠశాల ప్రకృతి ఒడిలో రనగొన ధ్వనులు లేని ప్రశాంతమైన వాతావరణం లో చాలా అద్భుతంగా ఉందని ప్రశంసించారు. ప్రాంగణంలో గోశాలను ఏర్పాటు చేయడం ఎంతో పవిత్రతచేకూరుతుందని, అన్ని శుభాలు జరుగుతాయని తెలిపారు. చైర్మన్ కి అభినందనలు తెలిపారు. విద్యా సంస్థల డైరెక్టర్లు పి మౌలాలి రెడ్డి, షేక్షావల్ రెడ్డి గురువర్యులు చాగంటి కోటేశ్వరరావు కి పూలమాల, శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

# నంద్యాలలో ఎస్ఎల్ఎన్ హాస్పిటల్ ను ప్రారంభించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 20:**
నంద్యాల పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా, పద్మావతి నగర్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎల్ఎన్ హాస్పిటల్స్ (సూపర్ స్పెషాలిటీ గ్యాస్ట్రో, లివర్ & ఎండోస్కోపీ సెంటర్) ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ , డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పుల్లల చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ హరి సింహా ఆధ్వర్యంలో ఈ ఆసుపత్రి నడుస్తుందని తెలిపారు. గ్యాస్ట్రో (జీర్ణకోశ), కాలేయ మరియు ఎండోస్కోపీ సంబంధిత సమస్యలకు అత్యాధునిక సాంకేతికతతో కూడిన చికిత్సను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. మీ ఆరోగ్యమే.. మా బాధ్యత అనే నినాదంతో రోగులకు నాణ్యమైన వైద్యం అందిస్తామని వారు తెలిపారు.

ఆసుపత్రిని ప్రారంభించిన అనంతరం మంత్రి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల వంటి ఎదుగుతున్న పట్టణాల్లో అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడం శుభపరిణామమని అన్నారు. ప్రజలు వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, స్థానికంగానే సూపర్ స్పెషాలిటీ సేవలు అందడం సంతోషకరమని తెలిపారు. డాక్టర్ హరి సింహా వంటి అనుభవజ్ఞులైన గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ సేవలు నంద్యాల ప్రజలకు దొరకడం ఒక గొప్ప అవకాశమని, జీర్ణకోశ మరియు కాలేయ సమస్యలతో బాధపడేవారికి ఇది ఒక వరమని ఆయన అన్నారు . ఆసుపత్రులు కేవలం వ్యాపార దృక్పథంతో కాకుండా, సేవా భావంతో పనిచేయాలని ఆయన సూచించారు. పేద ప్రజలకు సైతం నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని యాజమాన్యాన్ని కోరారు. ఆరోగ్య రంగంలో ప్రైవేటు ఆసుపత్రుల పాత్ర కీలకమని, మెరుగైన వైద్య సేవలందించే సంస్థలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ తన వంతు సహకారాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, వైద్య సిబ్బంది మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు